

# డాక్టర్‌గారి భార్య

## – కొమ్మూరి వేణుగోపాలరావు



(గత సంచిక తరువాయి)

**ఇంకో అతను వచ్చాడు.**

పురుషాంగం నుండి ఎప్పుడూ ద్రవం ఊరుతోంది.

చాలామంది డాక్టర్ల దగ్గరకు వెళ్ళాడు. అతని హిస్టరీ ప్రకారం స్త్రీతో కలిశాక వచ్చింది.

గనేరియాకు ట్రీట్ చేశారు.

తగ్గటం లేదు.

అతనిమీద యాంటీ బయాటిక్ లేదు. పెన్సిలిన్, టెట్రా సైక్లిన్, యాంపిసిలిన్, ఎరిత్రోమైసిన్, క్లోరోమైసిటిన్, జెన్‌టామైసిన్‌లన్నీ ప్రయోగం చేసి చూశారు.

ఫలితం కనిపించలేదు.

నెలలు గడిచిపోతున్నాయి.

అనుకోకుండా నరేష్ దగ్గరకు వచ్చాడు. ఇహ యాంటీబయాటిక్స్ ఇచ్చి ప్రయోజనం లేదని ద్రవం తీసి మైక్రోస్కోప్‌లో టెస్ట్ చేశాడు.

ఎమీబా!

ఒకటికాదు – రెండు కాదు. కోకొల్లలు.

వెంటనే ఎమీబియాసిస్‌కు ట్రీట్‌మెంట్ ఇచ్చాడు.

అంతే.

అయిదురోజుల్లో ద్రవించటం ఆగిపోయింది. నెలల తరబడి అనుభవించిన యమచెర నుండి విముక్తి లభించింది.

ఈ మూడు కేసులూ మెడికల్ ఎసోసియేషన్ క్లినికల్ మీటింగ్‌లో ప్రెజంట్ చేశాడు.

చాలామంది అభినందించారు.

కొంతమంది గ్రుచ్చి గ్రుచ్చి ప్రశ్నలు వేశారు.

ఆ ప్రశ్నల్లో నిజాయితీ ఉంది హేళనా వుంది. "నువ్వుపోస్ట్ గ్రాడ్యుయేట్"వి కాదన్న వ్యంగ్యం వుంది.

చేతనైనంత వరకూ జవాబులు చెపుతూ, అంతర్గతమై వున్న ఆ అపహాస్యాన్ని భరించాడు.

ఇంటికి వచ్చి ఆరాటంగా, తపనగా అటూ యిటూ దొర్లుతున్న నరేష్ ని సహజ దగ్గరకు తీసుకుంది.

"ఏమిటి?" అడిగింది మెల్లగా.

"నేను పోస్ట్‌గ్రాడ్యుయేట్‌ని కావాలి. నేను పోస్ట్ గ్రాడ్యు యేట్‌ని కావాలి."

"నరేష్" అంది అతని పెదవులకు దగ్గరగా అలా ఎప్పుడోగాని పిలవదు.

"అవుతావు. తప్పకుండా నువ్వు పోస్ట్‌గ్రాడ్యు యేట్‌వి అవుతావు."

నరేష్ ఎక్కువగా భయపడేది సెక్స్ సమస్యలతో సతమతమయే పేషెంట్సుతో.

కొన్ని కొన్ని శారీరక వ్యాధుల్ని వదిలేస్తే మిగతావన్నీ మానసికమైన అనుమానాలు.

అన్నీ కలిపి పది పదిహేను ఉండవు.

కాని వాటిని వెయ్యిగా, లక్షగా భావించుకుని అభివర్ణించుకుంటూ వుంటారు.

ఎవరికివారు తమది ప్రత్యేకమైన సమస్య అనుకుంటారు .డాక్టరు చెప్పినంతసేపూ తల ఊపి, బయటకు రాగానే పాత భయానికీ, అనుమానానికీ లొంగిపోతారు.

నూటికి తొంభైమందికి హస్తప్రయోగం అలవాటు. దాన్ని గురించి భయంకరంగా ఊహించుకుంటారు. మానసికంగా కృంగిపోతూ ఉంటారు. సెక్స్ స్పెషలిస్ట్‌లమని బోర్డులు పెట్టుకున్నవాళ్ళ దగ్గరకు పిచ్చి కుక్కలా తిరుగుతూ వుంటారు. వాళ్ళు చెప్పినవన్నీ చేస్తూ డబ్బులు ఖర్చుపెట్టుకుని, హరించుకుపోతూ ఉంటారు.

ఇహ సుఖరోగాలు సరేసరి.

మానవజాతి ఉన్నంతవరకూ అవి ఉంటూనే ఉంటాయి.

వాటిని ఇప్పుడు ఎస్.టి.డి అంటున్నారు. లైంగిక చర్య వల్ల వచ్చే వ్యాధి – సెక్సువల్లీ ట్రాన్స్‌మిటెడ్ డిసీజ్.

సిఫిలిస్ ఇప్పుడు బాగా తగ్గిపోయింది .యాంటీ బయోటిక్స్ పుణ్యమా అని.

ఒకప్పుడు సిఫిలిస్ భయంకరంగా విలయతాండవం చేసేది. శరీరంలోని ప్రతి అవయవాన్నీ – మర్మాంగాలూ, స్త్రీలయితే గర్భసంచి, తర్వాత ఇద్దరిలో లివర్, కిడ్నీస్, గుండె, ఊపిరి తిత్తులు, గొంతు, బ్రెయిన్ – ఇలా శిథిల చేసి పారేసేది.

ఇప్పుడంతగా లేదు. అంత ఉధృతమైన కాంప్లికేషన్లూ లేవు.

గనేరియా. లింఫో గ్రాన్యులోమా. గ్రాన్యులోమా వెనీరియం. షాంక్రాయిడ్. ఇప్పుడు హెర్పిస్.

హెర్పిస్ వైరస్ వల్ల వస్తుంది. చిన్ని మచ్చలాగానో చీలికలాగానో వుంటుంది. దానికి సరి అయిన మందు లేదు. తగ్గినట్లే తగ్గి ఇంటర్‌కోర్స్ జరిగినప్పుడల్లా మళ్ళీ కనబడుతూ వుంటుంది. మానసికమైన బాధ తప్ప దాని కాంప్లికేషన్లు ఎక్కువగా వున్నట్లు కనబడవు – ప్రస్తుతానికి.

"నా పేరు వనజ"

మనిషి కూడా చాలా అందంగా వుంది.

"కూర్చోండి"

"నేను కమ్మరిషియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో టైపిస్ట్‌గా పనిచేస్తున్నాను."

"చెప్పండి."

"నా వయస్సు ఇరవై రెండేళ్ళు. పెళ్ళయి నాలుగేళ్ళయింది. విశేషమేమిటంటే నాకు బహిష్టులు లేవు. అసలు నేను రజస్వల అవలేదు."

కొంచెం ఉలికిపడి ఆమె వంక పరీక్షగా చూశాడు.

ఆమె రజస్వల అవలేదు. అంటే మెనార్కీలేదు.

మనిషి పొడవుగా నాజూగ్గా వుంది. అంగసౌష్టవం ఫర్వాలేదు.

"నా భర్తకు యీ విషయం తెలుసు. ముందే చెప్పాను మేమిద్దరం ప్రేమించి పెళ్ళి చేసుకున్నాము."

"మీ యిద్దరి దాంపత్య జీవితం ఎలా వుంటుంది?"

"అంటే?"

"స్పందన, ఉద్రేకం.."

"అన్నీ బాగుంటాయి. ఇద్దరిలో ఎవరికీ అసంతృప్తి లేదు. నిజానికి మా సెక్సువల్ లైఫ్ చాలా బాగా ఎంజాయ్ చేస్తాం."

"మీ విషయం చెప్పండి"

"నాక్కూడా అందరు ఆడవాళ్లలాగే కోరికలు ఎక్కువగానే వుంటాయి.""

"అందరి ఆడవాళ్ళ విషయం మీకెలా తెలుసు?"

నవ్వింది. "ఊహ."

"ఇప్పుడు మీకేం కావాలి?"

"నన్ను ఎగ్జామిన్ చెయ్యండి. నాలో ఎక్కడో డిఫెక్ట్ వుంది అదేమిటో తెలుసుకోవాలి. ప్రతి స్త్రీకీ పిల్లలు పుట్టాలన్న కోరిక వుంటుంది కదా ఆ అవకాశం వుందో లేదో.."

ఆమెను థరోగా ఎగ్జామిన్ చేశాడు.

సెకండరీ సెక్సువల్ క్యారెక్టర్సన్నీ బాగానే వున్నాయి. వక్షోజాలు, ప్యూబిక్ హెయిర్, క్లైటోరిస్.

కాని ఆమెకు యుటరస్ లేదు. ఒకవేళ రుడిమెంటరీగా ఏ మూలైనా వుందేమో కనబడలేదు.

ఓవరీస్ వున్నాయి. అవి బాగానే ఫంక్షన్ చేస్తూ వుండాలి. అందువల్లే హార్మోన్లు ఉత్పత్తి అవటం, స్త్రీ సహజమైన కోరికలు, వయసుకు తగిన యితర సంపద...

ఆమెకు అంతా ఎక్స్‌ప్లెయిన్ చేసి, "మీకు గర్భసంచి లేదు కాబట్టి గర్భం రాదు" అన్నాడు.

"అంతేనా?" అంది నిరాశగా. "హర్ట్ ట్రాన్స్‌ప్లాంటు చేస్తున్నట్లు, ఎవరివో కిడ్నీస్ ఇంకొకరికి అమర్చినట్లు యుటరస్ ట్రాన్స్‌ప్లేన్‌టేషన్ జరగటానికి వీల్లేదా?

"ఇంతవరకూ జరగలేదు. ముందు విషయం చెప్పలేం సారీ!"

ఆమె నిరాశా నిస్పృహలతో వెళ్ళిపోయింది.

అలాగే..

ఇంకో ఇరవై ఏళ్ళ అమ్మాయి ఎన్నాళ్ళకూ రజస్వల కాకపోతే తీసుకొచ్చారు.

పరీక్ష చేస్తే అసలు వెజీనాయే లేదు. ఆ అమ్మాయికి తొందరపడి పెళ్ళి నిర్ణయం చేసేశారు.

ఇహ తల్లిదండ్రుల ఆందోళన.

డాక్టర్ విష్ణుమూర్తితో చర్చించాడు. ఆపరేషన్ చేయవచ్చునన్నాడు. ఇంకో యిద్దరు డాక్టర్ల సహాయంతో కష్టపడి వెజీనాను సృష్టించాడు.

పిల్లలు పుట్టకపోనీ, రజస్వల అవనీ అవకపోనీ – ఆమె సంసారానికి పనికి వస్తుంది.

కొంతమందికి ఎందుకంత విచిత్ర మనస్తత్వాలుంటాయో అర్థం కాదు.

సుకన్య అని ఓ పద్దెనిమిదేళ్ళ అమ్మాయి హాస్పటలులోకి అప్పుడప్పుడూ వస్తూ వుండేది..

ఒక్కసారి వంటరిగా వచ్చింది.

"నాకో సహాయం చేస్తారా?" అనడిగింది.

"ఏమిటి?"

"పరీక్ష చేసి, నేను కన్యనో కాదో చెప్పాలి?"

"ఎందుకు?"

"ఊరికినే తెలుసుకోవాలని వుంది."

"కారణం లేకుండా ఎందుకు?"

"నాకు తెలుసుకోవాలని వుందంతే."

"ఏదయినా అత్యాచారం జరిగిందా?"

"ఛీఛీ – అలాంటిదేమీ లేదు."

"మరి?"

"అంతే. నేను తెలుసుకోవాలి" అంది మంకుపట్టుపడుతూ.

ఆమె కోరిక అతనికి సిల్లిగా అనిపించి చాలాసేపు తిరస్కరించాడు . కాని ఆమె జిడ్డులా వొదల్లేదు. పరీక్ష చేస్తేనేగాని బయటకు పోనని మొండికేసింది. విధిలేక ఎగ్జామిన్ చేశాడు.

ఇది ఓ కొత్త అనుభవం. హైమెన్ అనేది కంటికి కనిపిస్తుందా లేదా?

ఒకవేళ హైమెన్ లేకపోతే ఓ స్త్రీ కన్యకాదని చెప్పవచ్చునా?

హైమెన్ = కన్నెపొర.

దీనిమీద చాలామందికి విపరీతాభిప్రాయాలున్నాయి.

కొన్ని దేశాల్లో పెళ్ళికి ముందు యూతి కన్య అవునా కాదా అని తేల్చుకునేందుకు యీ పరీక్షలు చేయిస్తారని చెబుతారు.

ఆ యువతి జీవితం యీ పరీక్ష మీద ఆధారపడి వుంటుంది. ఇంకో విషయం కూడా విన్నాడు. పెళ్ళికి ముందు నిజంగా కన్యత్వం పోగొట్టుకున్న యువతులు కూడా పెళ్ళి కావటం కోసం కృత్రిమమైన కన్నెపొర ఏర్పాటు చేసే ఆపరేషన్ – హైమనోప్లాస్టీ చేయించుకుంటారని –

ఇక్కడ కూడా...

కొంతమందికి మొదటిసారి సంయోగం జరిగినప్పుడు కన్నెపొర చిరిగి రక్తస్రావం జరగాలని, అలా కాకుంటే ఆమె కన్నెరికం యిదివరకే పోగొట్టుకుని వుంటుందని కొందరి  నమ్మకం.

కాని చాలామందికి రక్తస్రావం జరగదు.

మొదట అంత ప్రార్థించిన మనిషి యిప్పుడు బొత్తిగా కోపరేట్ చెయ్యటంలేదు. ముడుచుకుపోతుంది.

కష్టంమీద లైటు సాయంతో చూడగలిగాడు.

వెజీనాని సగం వరకూ కవర్ చేస్తూ, అర్ధచంద్రాకారంలో ఓ సన్నని పొరలా, చిన్న తెరలా – హైమెన్ కనబడింది.

'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుని "ఆఁ మీరు కన్యే" అన్నాడు.

ఆ అమ్మాయికి కొండంత సంతోషం కలిగినట్లు, వెలిగిపోతున్న ఆమె ముఖం చెబుతోంది.

"థాంక్సండీ. చాలా థాంక్స్ మెనీ మెనీ థాంక్స్" అంటూ అతని ఫీజు చెల్లించి వెళ్ళిపోయింది.

ఇంకో ఆశ్చర్యకరమైన సంఘటన.

ఆమెకు నలభై ఆరేళ్ళుంటాయి. చూడటానికి యాభై ఏళ్ళకు పైగా ఉన్నట్లుంటాయి. కొడుకూ, కోడలూ, మనవడూ, మనవరాలూ ఉన్నారు.

వాళ్ళు అతని దగ్గరకు తరచు వచ్చే పేషెంట్లే. ఆమెకు వాంతులవుతూంటే కంగారుపడి అతని దగ్గరకు తీసుకొచ్చారు.

బాగా నీరసంగా వుంటే ఎడ్మిట్ చేసి గ్లూకోజ్ డ్రిప్ పెట్టాడు.

కాని వాంతులెందుకవుతున్నాయి?

జ్వరం లేదు

కామెర్లా?

కాదు.

కేసు అబ్జర్వేషన్‌లో పెట్టాడు.

ఆ సాయంత్రం.. తనవాళ్ళు ఎవరూ లేకుండా చూసి బావురుమని ఏడుస్తూ అతని కాళ్ళు పట్టుకుంది.

"తప్పుచేశాను బాబూగారూ! మీరు కాపాడకపోతే కృష్ణలో దూకటమే శరణ్యం."

అతను ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"బుద్ధి గడ్డితిని కక్కుర్తిపడ్డాను బాబుగారూ. నెల తప్పింది. అబ్బాయికి తెలిస్తే నన్ను..." చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తోంది.

అతనికి చాలా ఆశ్చర్యంగా వుంది. ఆమె మెనోపాస్ ఏజ్‌లో ఉంది. కాని బహిష్టులు అవుతూనే వుందన్నమాట.

అంజన సాయంతో మూడోకంటివాడికి తెలీకుండా ఎబార్షన్ చేశాడు.

అంజన నోట్లోంచి మాట బయటకు పొక్కదు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS